రైతుల కష్టం వర్షార్పణం

అన్నదాత రెక్కల కష్టం వర్షార్పణమైంది. కొంతకాలంగా కురుస్తున్న వానలకు పైర్లన్నీ నీట మునిగి తీవ్ర నష్టం కలిగింది. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- భారీ వర్షాలతో దెబ్బతిన్న పైర్లు
- ఆందోళనలో అన్నదాత

ఆత్మకూరు: ఖరీఫ్ ప్రారంభం నుంచే వర్షాలు పడటంతో డివిజన్‌లో దాదాపు 10 వేల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారు. అయితే ఎన్నడూ లేనివిధంగా ఈ యేడాది రికార్డుస్థాయిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆగస్టు నెలలో సాధారణంగా 165 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా వారం కూడా కాకముందే 100 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇంకా ఈనెల మరో 20 రోజులకుపైగా ఉండడంతో సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షం పడే అవకాశం ఉంది. మే నెలలో సాధారణ వర్షపాతం కేవలం 29 మి.మీ. కాగా, గత పదేళ్లల్లో ఎన్నడూ లేనంతగా 139 మి.మీ. రికార్డుస్థాయిలో వర్షం కురిసింది. జూన్ నెలలో సాధారణంగా 92 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా అత్యధికంగా 250.2 మి.మీ. భారీ వర్షం కురిసింది. జూలై నెలలో 167 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా అంతకంటే ఎక్కువ 281.9 మి.మీ. వర్షం కురిసింది. ఇలా భారీ వర్షాల కారణంగా పైర్లన్నీ నీట మునిగిపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


మొక్కజొన్న పైరులో నిలిచిన వర్షపునీరు

నీట మునిగిన పైర్లు

ఆత్మకూరు మండలంలో ఈయేడాది దాదాపు 10 వేల హెక్టార్లలో రైతులు మొక్కజొన్న, పత్తి, కంది, మెట్ట వరి పంటలను సాగుచేశారు. పైర్లు బాగా పెరుగుతున్నాయని రైతులు సంబరపడుతున్న సమయంలో వరుణుడు కక్ష్యకట్టినట్లు ఎడతెరిపిని వ్వకుండా కురుస్తున్నాడు. దాదాపు నెలలో 20 నుంచి 22 రోజులకు పైగా విస్తారంగా వర్షాలు కురవడంతో పైర్లన్నీ భారీగా దెబ్బతిన్నాయి. మొక్కజొన్న, కందిపైర్లకు పూర్తి నష్టం కలిగింది. కాగా ఆత్మకూరు మండలంలో ఇటీవల రెవెన్యూ అధికారులు పర్యటించి పంట నష్టంపై అంచనాలు రూపొందించారు.

2,700 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట నష్టం

ఆత్మకూరు మండలంలో అత్యధికంగా మొక్కజొన్న సాగు చేశారు. 7 వేల ఎకరాల్లో పంట సాగు చేయగా ఇప్పటికే దాదాపు 2,700 ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతిందని రెవెన్యూ అధికారుల లెక్కలు చెబుతున్నా అంతకు ఎక్కువగానే నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంది పంట కూడా పూర్తిగా దెబ్బతింది. పంటలు చేతికొచ్చే సమయంలో ఊహించని రీతిలో వరుణుడి రాకతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు.

పెట్టుబడులు కూడా ఎక్కువే..

మే, జూన్ నెలల్లో రైతులు వేసిన మొక్కజొన్న పంట ఏపుగా పెరగకపోవడంతో పంటను ధ్వంసం చేసి తిరిగి రెండోసారి అదే మొక్కజొన్న పంటను సాగుచేశారు. ఈ పంట వేస్తే అధిక వర్షాలకు పంట ఏపుగా పెరగకపోగా, చాలాచోట్ల వర్షపునీరు నిల్వ ఉండడంతో పాటు నీరు నిల్వని పొలాల్లో విస్తారంగా గడ్డి పెరగడంతో పంట పెరిగే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఒకటికి రెండు సార్లు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనులైన విత్తు వేయడం, ట్రాక్టర్లతో దుక్కిదున్నడం తదితర విషయాల్లో రైతులు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల దాకా పెట్టుబడులు పెట్టారు. అవి కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.


ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నాం



ఈ యేడాది కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న, కంది పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. అంచనాలు రూపొందించి నివేదికలను జిల్లా వ్యవసాయాధికారులకు పంపాం. ఇప్పటికే దాదాపు 2,700 ఎకరాలకు పైగానే మొక్కజొన్న పంట దెబ్బతింది. ఈనెలలో ఎంతమేర పంట దెబ్బతింటుందో తేలాల్సి ఉంది. రైతులు పొలాల్లో వర్షపునీటిని తొలగించుకుంటే కొంతవరకు నష్టాన్ని నివారించుకోవచ్చు. యూరియా చల్లితే మొక్కజొన్న పంట పెరిగే అవకాశం ఉంది.

– విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఆత్మకూరు

"వానదేవుడు పగ బట్టాడు



తొలకరిలో వర్షాలకు 12 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. జూన్ నెలలో కురిసిన అధిక వర్షాలకు పైరు కుళ్లిపోవడంతో తొలగించి మరోసారి జొన్న వేశాను. పైరు ఏపుగా పెరుగుతున్న సమయంలో వానలు పగపట్టినట్లు రావడంతో పొలంలో నీరు నిలిచి మునిగిపోయింది. ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల దాకా ఖర్చు పెట్టాను. ఈ లెక్కన దాదాపు రూ.3.5 లక్షల పెట్టుబడి అయ్యింది. పూర్తిగా నష్టపోయాను.

– మునలిమడుగు నబీసాహెబ్, రైతు, ఆత్మకూరు

"నష్టపరిహారం చెల్లించాలి



ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని పంటను సాగుచేశాను. ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది వర్షాలు కురిశాయి. ఆగస్టులో కూడా వర్షాలు పడుతున్నాయి. దీంతో మొక్కజొన్న పంట దెబ్బతింది. దాదాపు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు దాకా నష్టపోయాను. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– నజీముద్దీన్ రైతు, ఆత్మకూరు

క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు


పూజలు నిర్వహిస్తున్న పూజారులు

శ్రీశైలం: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం వద్ద ప్రతిష్ఠించిన దత్తాత్రేయస్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం సర్కారిసేవగా పంచామృతాభిషేకం నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే రూపంలో అవతరించినందున త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయుడిని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

జగద్గురు పీఠాధిపతికి పూర్ణకుంభ స్వాగతం


జగద్గురు పీఠాధిపతికి పూర్ణకుంభస్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

శ్రీశైలం: భ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల దర్శనార్థమై శ్రీశైలం వచ్చిన జగద్గురు పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామశివాచార్యమహాస్వామీజీకి అర్చకులు, వేదపండితులు గురువారం ప్రధాన ద్వారం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాది కుంకుమార్చనలను ఆయన నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపండితులు స్వామీజీకి వేదగోష్టి నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ ఏఈఓ హరిదాసు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ


తహసీల్దార్ సుభద్రమ్మ

పాములపాడు: స్థానిక తహసీల్దార్‌గా సుభద్రమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. చాగలమర్రి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు వెళ్లారు. కోడ్ ముగియడంతో జిల్లాకు తిరుగొచ్చిన అధికారులకు జిల్లా కలెక్టర్ స్థానాలు కేటాయించారు. ఈక్రమంలో సుభద్రమ్మ విధుల్లో చేరారు. కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా ఆది




నందికొట్కూరు: పీడీఎస్‌యూ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆది తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పింఛన్లపై విచారణ


విచారణ చేస్తున్న ఎంపీడీఓ జవహర్ బాబు

కొత్తపల్లి: మండలంలోని జి.వీరాపురం గ్రామంలో ఇన్‌ఎలిజిబుల్ పింఛన్లపై ఎంపీడీఓ జవహర్‌బాబు గురువారం విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్‌కు వికలాంగ పింఛన్ వస్తున్నట్లు గుర్తించామని, ఇద్దరు మహిళలు తమ భర్తలు మృతిచెందకపోయినా వితంతు పింఛన్ పొందుతున్నట్లు విచారణలో తేలిందని, అలాగే మరో ఇంట్లో భార్య, భర్తకు పింఛన్ వస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే వీరి పింఛన్లు ఇన్‌ఎలిజిబుల్‌లో ఉన్నాయని, పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని మండల వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. గురువారం సంజీవ్‌నగర్ తండా పరిధిలోని వరి పంటలో పొలంబడి కార్యక్రమాన్ని చేపట్టారు. వరి సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధి, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, సమగ్ర సస్యరక్షణ చర్యలను వివరించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రైతులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఆంజనేయ ఉన్నారు.

రక్తహీనత పిల్లల పట్ల శ్రద్ధ వహించండి

పాములపాడు: రక్త హీనతతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించాలని ఫుడ్‌సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, కాశీంవలి సూచించారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వంటకు సరుకులను పరిశీలించారు. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం పోర్టిఫైడ్ అన్నారు. నీటిలో తేలుతాయని, అంత మాత్రం ప్లాస్టిక్ బియ్యం కాదని, పిల్లలకు బలవర్ధకమైనవని వివరించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చక్కగా చదువుకోగలరని, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. వారి వెంట ఎస్‌ఓ రాజ్యలక్ష్మి ఉన్నారు.


కేజీబీవీని తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు

యువకుడి ఆత్మహత్య


ప్రసన్నకుమార్ మృతదేహం

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని కల్వరి కొండ వీధికి చెందిన చంద్రకంటి నాగన్న, నాగమ్మ దంపతుల కుమారుడు ప్రసన్నకుమార్(25) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్‌ఐ రఘురామయ్య తెలిపిన వివరాలు.. ప్రసన్న కుమార్ రోజువారి కూలీ పనికెళ్తుండేవాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నాటు సారా స్వాధీనం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వాసవి సత్రం సమీపంలో గురువారం పోలీసులు 13 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ ప్రసాద్‌రావు తెలిపినప వివరాలు.. ప్రకాశం జిల్లా దోర్నాల నుంచి నలుగురు శ్రీశైలంలోని వాసవి సత్రం సమీపంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మధ్యాహ్నం వన్ టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నల్లబోతుల నాగేంద్ర, పి.రాజేశ్వరి, రమణమ్మ, నల్లబోతుల లక్ష్మిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ లక్ష్మణరావు, ఏఎస్‌ఐ గురువయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



నాటు సారాను చూపుతున్న సీఐ ప్రసాద్‌రావు

మెడికల్ క్యాంపునకు విశేష స్పందన

మహానంది: మండలంలోని పార్వతీపురం చెంచు కాలనీలో గురువారం నిర్వహించిన మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. వైద్య సిబ్బంది హాజరై పలువురికి వైద్యసేవలు అందించారు. వర్షా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల లీగల్‌సెల్ సభ్యుడు న్యాయవాది శేషసాయి, సిబ్బంది రామచంద్రారెడ్డి, మదర్ సొసైటీ సీఈఓ రామారావు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గాలేరుకు నీటి విడుదల

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి గురువారం నీటిని విడుదల చేశారు. వీబీఆర్ పరిధిలోని స్పిల్‌వే నుంచి ఒక గేట్ ఎత్తి 7100 క్యూసెక్కుల నీటిని గాలేరుకు విడుదల చేస్తున్నట్లు ఏఈఈ శివనాయక్ తెలిపారు. మద్రాస్ కాల్వకు 5 వేలు, వన్ ఎల్‌కు 30, వన్ ఆర్‌కు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 16,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం వీబీఆర్‌లో 16.32 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. గాలేరుకు నీటిని విడుదల చేయడంతో ఉధృతి అధికంగా ఉంటుందని, ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఈ హెచ్చరించారు.


స్పిల్‌వే నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

నందికొట్కూరు: నాగుల చవితి వేడుకలను గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయమే పుణ్యస్నానాలాచరించి పిండి వంటలు చేసుకుని ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించుకున్నారు. నాగుల కట్టలు, పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి మొక్కలు తీర్చుకున్నారు. నూతన వధూవరులు నాగదేవతా ప్రతిమల చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిని చాటుకున్నారు.

మిడుతూరు: మండల వ్యాప్తంగా నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రజలు ఉదయాన్నే స్నానాలాచరించిన అనంతరం నూతన వస్త్రాలను ధరించి నాగుల కట్ట, పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామివార్లకు ప్రీతికరమైన నువ్వుల లడ్డూ, పచ్చి బేడలు, బెల్లం, కొబ్బెర, కాయ, కర్పూరం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, పాత,కొత్త ముచ్చుమర్రి, వనములపాడు, ఆంజనేయనగర్, బీరవోలు, సంకిరేణిపల్లె, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఎం,ఎస్. ఘణపురం తదితర గ్రామాల్లోని ప్రజలు గురువారం నాగులచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మహిళలు నాగులకట్టకు చేరి నాగదేవతా ప్రతిమలకు పాలు పోసి భక్తితో పూజించి నైవేద్యాలు, కొత్త వస్త్రాలు సమర్పించారు.


మిడుతూరులో సుంకలా పరమేశ్వరీ ఆలయం వద్ద ఉన్న నాగ ప్రతిమలకు పాలు పోస్తున్న మహిళలు

పాములపాడు: మండలంలో నాగుల చవితి పండుగను ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రజలు ఆయా గ్రామాల్లోని పుట్టలు, నాగుల కట్టల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు పోసి, నైవేద్యాలుగా నువ్వుల పిండి, చలువ పిండి ముద్దలు, ఎండు కొబ్బరి గిన్నెలు, గుగ్గిళ్లు ఉంచి కాయ, కర్పూరాలతో పూజలు చేశారు.

జూపాడుబంగ్లా: నాగపంచమి వేడుకలను పురస్కరించుకొని గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లోని నాగదేవతల విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తరిగోపుల, తూడిచెర్ల, పారుమంచాల, తర్తూరు, మండ్లెం, భాస్కరాపురం, 80బన్నూరు, తంగడంచ, తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా గ్రామాల్లోని నాగుల పుట్టలు, నాగులకట్టల వద్ద నాగదేవతల విగ్రహాలకు పాలుపోసి ఏడాదంతా తమకు నాగుపాముల నుంచి ఎలాంటి ఆపద వాటిల్లకుండా రక్షణ కల్పించాలని వేడుకొంటూ మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం రక్షగా చేతులకు నాగరక్షబంధనం కట్టుకొన్నారు.

మల్లన్న సన్నిధిలో ఘనంగా నాగుల చవితి



శ్రీశైలంలో నాగప్రతిమలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రీశైలం: భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని నాగులకట్ట వద్ద శ్రావణశుద్ధ నాగులచవితి సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించుకున్నారు. ఉదయమే నాగులకట్ట వద్దకు చేరుకుని నాగదేవతల ప్రతిమలకు పూజలు చేశారు. పత్తితో చేసిన వస్త్రం, యజ్ఞోపవీతం, పలు రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం నాగమూర్తులకు పాలు పోసి అభిషేకించి నువ్వుల పిండి, చలిమిడి, వడపప్పులను నివేదన చేశారు.

వెలుగోడు: నాగులచవితి పర్వదినాన్ని గురువారం మండలంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం సమీపంలో ఉన్న నాగులకట్ట వద్ద భక్తులు వేకువజాము నుంచి పూజలు చేశారు. కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడిని పూజించారు. విశేష అభిషేకాలు, నాగదోష, కాలసర్పదోష, రాహుకేతు పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి, పొంగళ్లు వండి స్వామివారికి నివేదించారు.

మహానందిలో..

మహానంది: నాగులచవితి సందర్భంగా మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో గురువారం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గ్రామాల్లో కొలువైన పుట్టల వద్దకు భక్తులు చేరుకుని పాలు, పెసరపప్పు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులు పుట్ట వద్ద నాగదేవతకు చీర, పసుపు, కుంకుమ సమర్పించి పూజలు చేపట్టారు.


మహానందిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన ఎస్‌ఎంసీల ఎన్నికలు

నందికొట్కూరు: విద్యాశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలు గురువారం ముగిశాయి. నందికొట్కూరు మండలంలోని 56 పాఠశాలలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎక్స్‌అఫీషియో మెంబర్లను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో చైర్మన్లుగా 34 మంది పురుషులు, 22 మంది మహిళలు ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్లుగా మహిళలు 43, పురుషులు 13 మంది ఎన్నికయ్యారు. ఎన్నికలను ఎంఈఓ ఫైజున్నీసాబేగం పర్యవేక్షించారు.

పగిడ్యాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కోరం లేక చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఆంజనేయనగర్ ప్రాథమిక పాఠశాలలో ఒకే విద్యార్థి ఉన్నందున ఈ పాఠశాలలోనూ ఎన్నిక నిర్వహించలేదు. నెహ్రూనగర్ గ్రామంలో స్వల్ప వివాదం తలెత్తగా నందికొట్కూరు రూరల్ సీఐ బీఆర్ క్రిష్ణయ్య, ముచ్చుమర్రి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గంగయ్య యాదవ్ అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. 18 పాఠశాలలు ఏకగ్రీవం కాగా 8 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు.

పాములపాడు: ఎస్‌ఎంసీ ఎన్నికలు గురవారం పాములపాడు ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మినహా అంతటా ప్రశాంతంగా జరిగాయి. లింగాల, ఇస్కాల గ్రామాల్లో గట్టి బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించారు. కాగా ఇస్కాల గ్రామంలో ఇరువర్గాల వారు గ్రామంలో ఓటుకు రూ.1500, రూ.2,000 చొప్పున పంపిణీ చేసినట్లు సమాచారం.


పగిడ్యాల మండలం నెహ్రూ నగర్ పాఠశాలలో చైర్మన్ ఎన్నికకు ఓటింగ్ నిర్వహిస్తున్న హెచ్‌ఎం శేఖర్

మిడుతూరు: మండలంలోని 49 పాఠశాలలు ఉండగా 18 పాఠశాలల నిర్వహణ కమిటీలకు చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఈఓ శ్రీనాథ్ తెలిపారు. మిగతా 31 కమిటీలకు ఎన్నికలు నిర్వహించి చైర్మన్లను ఎన్నుకున్నామన్నారు.

కొత్తపల్లి: మండలంలోని 43 పాఠశాలలకు గానూ చిన్న గుమ్మడాపురం, మునలమడుగు ఉర్దూ పాఠశాలలో తప్ప అన్ని పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మునలమడుగు జిల్లా పరిషత్ పాఠశాలకు గఫర్ సాహెబ్, గోకవరం జెడ్పీహెచ్‌ఎస్‌కు సి.భూషన్న, దుద్యాల జెడ్పీహెచ్‌ఎస్‌కు ఎస్.షాహీన, కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు కె.శివకుమార్, కొత్తపల్లి కేజీబీవీకి వి.రాజమ్మ, శివపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు ఎస్.సెహనాజ్‌బేగం చైర్‌పర్సన్లుగా ఎన్నికయ్యారు. శివపురం, మునలమడుగు గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య స్వల్ప ఘర్షణలు చోటుచేసుకోగా ఎస్‌ఐ హరి ప్రసాద్ అక్కడికి చేరుకుని సర్దిచెప్పారు.

జూపాడుబంగ్లా: మండలంలోని 38 పాఠశాలల్లో ఎస్‌ఎంసీల ఎన్నికలు గురువారం ముగిశాయి. చైర్మన్లు, వైస్ చైర్మన్లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శ్రీశైలం నియోజకవర్గంలో..

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని పాఠశాలలో నిర్వహించిన పాఠశాలల నిర్వహణ కమిటీల ఎన్నికలు గురువారం ముగిశాయి. ఆత్మకూరు మండలంలోని 58 పాఠశాలల చైర్మన్లను, వైఎస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలను ఎంఈఓ సురేష్‌కుమార్ పర్యవేక్షించారు.

శ్రీశైలం: శ్రీశైలం పరిధిలోని 5 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐ ప్రసాద్‌రావు, ఎస్‌ఐ లక్ష్మణరావు భద్రత ఏర్పాట్లు చేశారు.

మహానంది: మండలంలోని 34 ప్రభుత్వ పాఠశాలల్లో సీతారామపురం గ్రామ పాఠశాల మినహా మిగిలిన అన్ని పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. తిమ్మాపురం జెడ్పీ పాఠశాలకు భూపాల్, ఏపీ మోడల్ స్కూల్‌కు తెలుగు ప్రభురాజు, తమ్మడపల్లె పాఠశాలకు ఐజ సుబ్బారావు, గోపవరం పాఠశాలకు నిరంజన్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. అలాగే బండిఆత్మకూరు మండలంలోని 47 ప్రభుత్వ పాఠశాలకు కూడా చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నట్ల ఎంఈఓలు మోహన్‌రెడ్డి, యశోద తెలిపారు.


ఆత్మకూరులో ఎస్‌ఎంసీ ఎన్నికను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ సురేష్‌కుమార్